కాటేస్తున్న కాలుష్యం!

- ఇష్టారాజ్యంగా రెడీమిక్స్‌ల ఏర్పాటు
- కొనసాగుతున్న క్రషర్‌లు
- కాలుష్యం.. శబ్దాలను భరించలేక పోతున్న ప్రజలు
- నేడు ఆందోళనకు సిద్ధమైన బాధిత ప్రజలు

మణికొండ: మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో గేటెడ్‌ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. నిర్మాణ స్థలంలోనే రెడీమిక్స్‌ ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నారు. వాటి పక్కనే అప్పటికే నిర్మితమైన కమ్యూనిటీలు, కాలనీల్లోని ఇళ్లల్లోకి దుమ్ము, ధూళి చేరి నివాసితులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

❖ జనావాసాలకు సమీపంలో కొత్తగా వచ్చే నిర్మాణాలలో రెడీమిక్స్‌లకు అనుమతులు ఇవ్వాలంటే వారి నుంచి నోఅబ్జక్షన్‌ పత్రాలు తీసుకోవటం, లేదంటే జనావాసాలకు దూరంగా ప్లాంట్‌లకు అనుమతులు ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నిబంధనలు ఉన్నాయి. స్థానికంగా వాటిని పట్టించుకోకుండా ఎడాపెడా అనుమతులు ఇవ్వటంతో అప్పటికే నివాసం ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



జనావాసాల పక్కనే కొనసాగుతున్న రెడీమిక్స్‌ ప్లాంట్‌

❖ నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి, కోకాపేట, ఖానాపూర్‌లలో ఎలాంటి అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో క్రషర్‌లు కొనసాగుతున్నాయి. వాటిల్లో ఒకటి, రెండింటికి మాత్రమే అధికారికంగా అనుమతులు ఉండగా మిగతావన్నీ నిబంధనలకు విరుద్ధగా కొనసాగుతున్నాయి. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో వారికి కొందరు మంత్రులు అండగా నిలవటంతో యథేచ్ఛగా కొనసాగాయి. అప్పటికే పీసీబీ కొన్నింటిని సీజ్‌ చేసింది. వాటికి విద్యుత్‌ సరఫరాను సైతం నిలిపివేయించింది. వారం రోజుల్లోనే అవి తిరిగి ప్రారంభమయ్యాయి.

నేడు బాధితుల ఆందోళన...

మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల సరిహద్దులో ఉన్న మైహోం అవతార్‌, హాల్‌మార్క్‌ వినిసియా నివాసితులు పీసీబీ, రెవెన్యూ అధికారులతో పాటు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు పలుమార్లు కాలుష్యపు కోరల నుంచి తమకు విముక్తి కల్పించాలని వినతి పత్రాలను సమర్పించారు. అయినా ఎలాంటి చర్యలు లేనందున శనివారం ఆందోళన చేయాలనే నిర్ణయానికి వచ్చారు.

రోడ్లపై దర్జాగా అక్రమ నిర్మాణాలు

అత్తాపూర్: బస్తీల్లోని రోడ్లను కొందరు దర్జాగా ఆక్రమించి తమ నిర్మాణాలను చేసుకుంటూ స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కల్గిస్తున్నారు. అత్తాపూర్‌ డివిజన్‌ హైదర్‌గూడలో ఓ వ్యక్తి నూతనంగా ఇంటి నిర్మాణాన్ని చేపడుతున్నాడు. తన స్థలంలో ఇంటిని నిర్మించుకొని పక్కనే ప్రజలు రాకపోకలు సాగించే రోడ్డును ఆక్రమించి మెట్లను నిర్మించాడు. ఇదేమని అడిగిన తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానికులు ఆరోపించారు. ప్రజల అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేయడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. అసలే చిన్న రోడ్లు కావడంతో ఈ దారి గుండా రాకపోకలు సాగించడమే ఇబ్బందికరంగా ఉంటుంది. ఇలా ఎవరికి తోచినట్లు వారు మెట్లు అంటూ రోడ్డుపైకి వచ్చి నిర్మాణాలు చేపడితే తాము ఎలా వెళ్లాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని వీటిని కూల్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.



హైదర్‌గూడలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన మెట్లు

సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ సంగీత

అత్తాపూర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అత్తాపూర్‌ కార్పొరేటర్‌ మోంద్ర సంగీతగౌరీశంకర్‌ పేర్కొన్నారు. తీర్థ ఫోర్‌ సీజన్‌ అపార్ట్‌మెంట్‌ సమీపంలోని శివాలయం పక్క వీధిలో రూ. 8.45 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను సత్వరమే పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌, అధికారులకు సూచించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి మోంద్ర కొమురయ్య, నాయకులు సులిగే వెంకటేష్‌, నల్లింగ్‌ లలిత, నల్లింగ్‌ జగదీశ్వర్‌, ఎస్‌.వెంకటేష్‌, నల్లింగ్‌ విజయ్‌, మల్లికార్జున్‌, జి.మధు, జి.వెంకటేష్‌, జి.దేవేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలను తొలగించరా?

మణికొండ: రోడ్ల పక్కన ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయొద్దు.. అలా వేసిన వారికి జరిమానా విధిస్తాం.. ఇదీ పురపాలక శాఖ పరిశుభ్రత గురించి చేసే హెచ్చరిక. విద్యుత్‌ అధికారులు రెండు నెలలకు ఒకసారి విద్యుత్‌ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను కొట్టేస్తున్నారు. అలా నరికి వేసిన చెట్ల కొమ్మల వ్యర్థాలు మాత్రం దాదాపు నెల రోజుల పాటు రోడ్ల పక్కనే ఉండిపోతున్నాయి. చెట్ల కొమ్మలను మున్సిపల్‌ శాఖ వెంటనే తొలగించకుండా రోజుల తరబడి అలాగే వదిలేస్తోంది. ఇరు శాఖలు సమన్వయంతో చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.



హనుమాన్‌నగర్‌ కాలనీలో రోడ్డు పక్కనే వదిలేసిన చెత్త

సందడిగా ‘టెక్నికల్‌ సింపోజియం’



నూతన ఆవిష్కరణలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌లు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో శుక్రవారం జాతీయ స్థాయి టెక్నికల్‌ సింపోజియం సందడిగా జరిగింది. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.సుధాకర్‌రెడ్డిలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇలాంటి టెక్నికల్‌ సింపోజియంలతో విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకత వెలుగులోకి వస్తుందన్నారు. ఈసీఈ, ఐటీ, సీఎస్‌ఈ, సీఎస్‌ఎం, సీఎస్‌బీ, సీఎస్‌డీ, ఈఈఈ, టెక్నోవేషన్‌, ఎంఎంఈ, మెకానికల్‌, సివిల్‌ విభాగాల వారీగా విద్యార్థులు నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అన్ని విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుపై శిక్షణ

బండ్లగూడ: సమగ్ర సర్వేలో వచ్చిన ఫారాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే దిశగా చర్యలు ప్రారంభించామని బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ బి.శరత్‌చంద్ర అన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని 22 డివిజన్‌ల నుంచి స్వీకరించిన సర్వే ఫాంలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం ఈ శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. విద్యాజ్యోతి ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీలో రెండు షిఫ్టులుగా సిబ్బంది పని చేసేందుకు వీలుగా 84 కంప్యూటర్లు, 168 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఉంటారని కమిషనర్‌ పేర్కొన్నారు. వారు సరైన పద్ధతిలో ఆన్‌లైన్‌ చేస్తారన్నారు. అందుకు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్‌ అసిస్టెంట్‌ పి.రాజేందర్‌రెడ్డి, టీవోటీలు పాల్గొన్నారు.



ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కమిషనర్‌ శరత్‌చంద్ర

స్వామియే శరణం అయ్యప్పా...



మహా పడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌

మణికొండ: స్వామియే శరణం అయ్యప్పా అంటూ అయ్యప్ప స్వామి శరణు ఘోషలతో పుప్పాలగూడ గ్రామం మారుమోగింది. గ్రామానికి చెందిన ఎ.ప్రేమ్‌దాస్‌ గౌడ్‌ తన 18వ మహాపడి పూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం గురుస్వాముల ఆధ్వర్యంలో ప్రారంభమైన పూజ మధ్యాహ్నం 18 మెట్ల మహా పడిని కాల్చటంతో ముగిసింది. జడల రమేష్‌ భజన బృందం పాడిన భక్తి పాటలు అందరినీ అలరించాయి. అనంతరం పెద్ద ఎత్తున అన్న ప్రసాద (భిక్ష) వితరణ నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్‌ మాట్లాడుతూ... అయ్యప్ప దీక్ష ఎంతో కఠినంగా ఉన్నా ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఎంతో మంది మాలాధారణ చేసి పూజలు చేస్తారన్నారు. భక్తి భావం ఉంటే మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. మాజీ ఎంపీపీ తలారి మల్లేష్‌, గురుస్వాములు రాజేందర్‌గౌడ్‌, సాయిరెడ్డి, జయసింహారెడ్డి, పెద్ద ఎత్తున అయ్యప్ప మాలాధారులు, కౌన్సిలర్‌లు, కాంగ్రెస్‌ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

బండ్లగూడ: బీసీల హక్కుల సాధన కోసం డిసెంబర్‌ 5, 6వ తేదీల్లో ఢిల్లీలో చేపట్టనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మనోజ్‌ పండ్ల అన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌ చేతుల మీదుగా శుక్రవారం నగరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనోజ్‌ మాట్లాడుతూ... 5వ తేదీన మహాధర్నా, 6వ తేదీన అఖిల భారత అఖిలపక్ష పార్టీల సమావేశం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం చేపట్టిన కుల గణన కార్యక్రమం విజయవంతంగా ముందుకు సాగుతున్నదని, ఇదే విధంగా దేశంలోని 29 రాష్ట్రాల్లోనూ బీసీల కుల గణన కార్యక్రమం ఎన్‌డీఏ ప్రభుత్వం జరిపించాలన్నారు. ఢిల్లీలో 5, 6వ తేదీల్లో జరిగే మహాధర్నా, అఖిల పక్ష సమావేశాలను 136 బీసీ కుల సంఘాల నాయకులు, మేధావులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు మద్దతు తెలిపి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

యువతి అదృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల సమాచారం మేరకు... మైలార్‌దేవ్‌పల్లి అలీ నగర్‌ ప్రాంతానికి చెందిన సత్తిబాబు కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని కుమార్తె ఎం.లక్ష్మీదుర్గాభవాని(21) గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో విచారించినా ఫలితం లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్‌ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



లక్ష్మీదుర్గాభవాని

కళాశాలకు వెళ్లిన యువతి...

మైలార్‌దేవ్‌పల్లి: కాలేజీకి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు సమాచారం మేరకు... సాయిబాబానగర్‌ ప్రాంతానికి చెందిన మింటుకుమార్‌, గుడియాకుమారి దంపతులు. వీరికి లూసీ(19) అనే కూతురు ఉంది. ఆమె నిత్యం ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతుండటంతో తల్లి మందలించింది. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటి నుంచి కాలేజీకి వెళ్లిన లూసీ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించారు.



లూసీ

శ్రీశైలం వెళ్లిన ఆటో డ్రైవర్‌...

మైలార్‌దేవ్‌పల్లి: ప్యాసింజర్‌ను తీసుకొని శ్రీశైలం వెళ్లి వస్తానని ఫోన్‌లో భార్యకు చెప్పిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సత్యకుమార్‌ సమాచారం మేరకు... బుద్వేల్‌ వెంకటేశ్వర కాలనీకి చెందిన శ్రీకాంత్‌(25), స్రవంతి భార్యాభర్తలు. ఆటో డ్రైవర్‌గా పనిచేసే శ్రీకాంత్‌ ఈ నెల 18న తన భార్యకు ఫోన్‌ చేసి తాను ప్యాసింజర్‌ను తీసుకొని శ్రీశైలంకు వెళ్లివస్తానని చెప్పాడు. ఇప్పటి వరకు తిరిగి రాకపోవడంతో ఆమె భర్తకు ఫోన్‌ చేసింది. అది స్విచ్‌ ఆఫ్‌ వచ్చింది. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.



శ్రీకాంత్‌

మతిస్థిమితం లేని వృద్ధురాలు...

మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌ పరిధిలోని మధుబన్‌ కాలనీకి చెందిన డంకన అనసూయమ్మ(84) అనే వృద్ధురాలు అదృశ్యమైంది. ఆమెకు మతిస్థిమితం సరిగాలేక ఇంట్లోనే ఉంటుంది. దీంతో ఆమె కుమారుడు డంకన శ్రీధర్‌ బాబు నిత్యం తన ఇంటి గేటుకు తాళం వేసి ఉంటారు. అయితే గురువారం మంచి నీరు రావడంతో తన భార్య గేటు తాళం తీసింది. అంతలోనే తల్లి ఇంటిలో నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అనసూయమ్మ

జీవో 60ని పటిష్టంగా అమలు చేయాలని వినతి

అత్తాపూర్: రాష్ట్రంలో జీవో 60ని పటిష్టంగా అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్‌ స్టాఫ్‌ అండ్‌ ఔట్‌ సోర్సింగ్‌ వర్కర్స్‌ యూనియన్‌ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి కోరారు. సోమాజిగూడలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా సంఘం చైర్మన్‌ డాక్టర్‌ చిన్నారెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజేంద్రనగర్‌ డివిజన్‌ పరిధిలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం 2021వ సంవత్సరంలో జీవో నెంబర్‌ 60ను విడుదల చేసిందన్నారు. ఆ జీవో ప్రకారం వాటర్‌ సప్లై (పంప్‌ ఆపరేటర్స్‌), సూపర్‌ వైజర్లకు రూ. 19,500, కంప్యూటర్‌ ఆపరేటర్లకు రూ. 22,750 ప్రకారం కనీస వేతనాన్ని అమలు చేయాలన్నారు. ఇప్పటి వరకు కార్మికులకు ఇస్తున్న కనీస వేతనాలు తక్కువగా ఉన్నాయన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. దీనికి స్పందించిన ప్రణాళికా సంఘం చైర్మన్‌ డాక్టర్‌ చిన్నారెడ్డి ఆయా సమస్యలపై చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్మిక నేతలు శ్రీనివాస్‌రెడ్డి, రాజు, బసవరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్‌ చిన్నారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జైపాల్‌రెడ్డి

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

శంషాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర నిర్వహణ సంబంధిత మరమ్మతు పనుల కారణంగా శంషాబాద్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బాషా తెలిపారు. కొత్వాల్‌గూడ, కవ్వగూడ, ఫోర్ట్‌గార్డెన్‌, ఆర్‌కే గార్డెన్‌, చెన్నమ్మ హోటల్‌, ఓఆర్‌ఆర్‌ సర్వీస్‌ రహదారి ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదని ఏఈ వివరించారు.

రాజేంద్రనగర్: విద్యుత్‌ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. గ్రీన్‌ వాక్‌, ప్రిస్టేజ్‌ విద్యుత్‌ ఫీడర్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సహారా హోమ్స్‌ విద్యుత్‌ ఫీడర్‌ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ ఉండదని వివరించారు.

సర్వేకు మంచి స్పందన

అత్తాపూర్: సమగ్ర ఇంటింటి సర్వేకు ప్రజల నుంచి స్పందన లభిస్తుందని సూపర్‌వైజర్‌ కె.స్వరూపరాణి అన్నారు. అత్తాపూర్‌ డివిజన్‌ తేజస్వీనగర్‌ కాలనీలో ఆమె ప్రజల నుంచి వివరాలను నమోదు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రానున్న రోజుల్లో ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలకు ఎంతో ఉపయోగంగా మారుతాయని అన్నారు. ఎన్యుమరేటర్లు గాయత్రీ, సకీరా తదితరులు పాల్గొన్నారు.



తేజస్వీనగర్‌లో సర్వే చేస్తున్న సూపర్‌వైజర్‌ స్వరూపరాణి

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మణికొండ: డ్రైనేజీలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. నార్సింగి పోలీసుల సమాచారం మేరకు... కోకాపేటలోని లెజెండ్‌ చైమ్స్‌ గేటెడ్‌ కమ్యూనిటీలోని విల్లా నెంబర్‌ 192 వెనుక ఉన్న డ్రైనేజీ కాలువలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. అతని వయసు 50 నుంచి 60 సంవత్సరాలు ఉంటుంది. భిక్షాటన చేసే వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదవ శాత్తు కాలువలో పడిపోయాడా.. సరైన ఆహారం లేక చనిపోయాడా.. ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు. అతనికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.



నేడు టీఐఈ సిల్వర్‌జూబ్లీ వేడుకలు

మణికొండ: ది ఇండస్‌ ఎంటర్‌ప్రెన్యూనర్స్‌ (టీఐఈ) ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి కావటంతో శనివారం సాయంత్రం గోల్కొండ రిసార్ట్‌లో సిల్వర్‌జూబ్లీ వేడుకలను నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. డిసెంబర్‌లో నూతన ఎంటర్‌ప్రెన్యూనర్స్‌ సమ్మిట్‌ బెంగుళూరులో నిర్వహిస్తుండటం, దానికి సంబంధించిన హైదరాబాద్‌కు చెందిన వారితో పలు విషయాలను ఇందులో చర్చిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్‌ జిష్ణు దేవ్‌ వర్మ హాజరవుతున్నారని వారు తెలిపారు.